స్పీకర్‌కు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఫిర్యాదు



కూకట్‌పల్లి: నియోజకవర్గంలో ప్రొటోకాల్‌ ఉల్లంఘనలపై స్పీకర్‌ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను శనివారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు సార్లు ప్రజల మద్దతుతో భారీ మెజార్టీతో గెలుపొందిన తాను ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తుంటే కొందరు అధికారులు ప్రొటోకాల్‌ను ఉల్లంఘిస్తూ పనులు చేయకుండా పబ్బం గడుపుతున్నారన్నారు. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవుతూ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతుంటే ప్రభుత్వ అధికారులు స్పందించకపోవడాన్ని స్పీకర్‌ దృష్టికి తీసుకెళ్లామన్నారు. వెంటనే స్పీకర్‌ సంబంధిత విభాగాల ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి శాసనసభ్యుడి హక్కులకు భంగం కలిగించే అధికారులపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ ఆదేశించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ట్రాఫిక్‌ సమస్యను పరిశీలించిన కార్పొరేటర్‌



ట్రాఫిక్‌ పోలీస్‌ అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్‌ నార్నే శ్రీనివాసరావు తదితరులు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్‌ డివిజన్‌ పరిధిలోని జేఎన్‌టీయూ ప్రధాన రహదారి నుంచి అడ్డగుట్ట, సమతా నగర్‌ మీదుగా ప్రగతినగర్‌ రోడ్డుకు వెళ్లే కూడలి వద్ద ఏర్పడుతున్న ట్రాఫిక్‌ సమస్య పరిష్కారానికి శనివారం హైదర్‌నగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ నార్నే శ్రీనివాసరావు ట్రాఫిక్‌ సీఐ వెంకట్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రద్దీ ఎక్కువగా ఉండే రోడ్లలో ఆక్రమణల తొలగింపులు, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. వాటర్‌వర్క్స్‌ ఎలక్ట్రిసిటీ వర్క్స్‌ జరుగుతున్న సమయాల్లో రోడ్ల తవ్వకాల పూడ్చివేతకు సంబంధించిన అంశాలపై దృష్టి సారించాలన్నారు. దుకాణాల ముందు వాహనాలు అడ్డదిడ్డంగా పార్కింగ్‌ చేయకుండా వ్యాపారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్‌ పోలీసులు, నాయకులు కుమార స్వామి, నిరంజన్‌ రెడ్డి, నిఖిల్‌ తదితరులు పాల్గొన్నారు.

బిగ్‌ ఎఫ్‌ఎం ఆటో ఎక్స్‌పో



ఎక్స్‌పోలో ప్రదర్శించిన కారు

కూకట్‌పల్లి: దేశంలోని ప్రముఖ రేడియో నెట్‌వర్క్‌లలో ఒకటైన బిగ్‌ ఎఫ్‌ఎం వారు కూకట్‌పల్లిలోని అశోకా వన్‌మాల్‌లో బిగ్‌ ఆటో ఎక్స్‌పోను శనివారం ప్రారంభించారు. ఈవెంట్‌లో విభిన్న కారు బ్రాండ్లైన సరికొత్త మోడల్స్‌, ఆవిష్కరణలను ప్రదర్శించారు. ఇందులో ముఖ్యంగా హర్ష టయోటా, పీపీఎస్‌ వోక్స్‌ వ్యాగన్‌, మహీంద్రా వంటి బ్రాండ్‌లను అందుబాటులో ఉంచారు. బిగ్‌ ఆటో ఎక్స్‌పో ద్వారా కస్టమర్లకు బ్రాండ్‌ ప్రతినిధులతో నేరుగా అనుసంధానం చేస్తూ వాహనాల శ్రేణిని పరీక్షించడానికి వేదికను ఏర్పాటు చేయడమే కాకుండా, ఈ ఈవెంట్‌లో మాత్రమే లభించే ప్రత్యేక ఆఫర్‌ల ప్రయోజనాన్ని పొందేందుకు ఏకైక అవకాశమని తెలిపారు. ఈ సందర్భంగా బిగ్‌ ఎఫ్‌ఎం సీఓఓ సునీల్‌ కుమారన్‌ మాట్లాడుతూ.. ప్రముఖ ఆటోమోటివ్‌ బ్రాండ్‌లను, తమ విలువైన కస్టమర్లను ఒక చోట చేర్చటం ఆనందంగా ఉందన్నారు. ఈ బిగ్‌ ఆటో ఎక్స్‌పో అశోకావన్‌ మాల్‌లో ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు.

పథకాలు అర్హులకు అందేలా కృషి చేయాలి



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

కూకట్‌పల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా కృషి చేయాలని బీజేపీ నియోకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు అన్నారు. పార్టీ కూకట్‌పల్లి డివిజన్‌ అధ్యక్షులు అనంత నాగరాజు అధ్యక్షతన కార్యవర్గ సమావేశం శనివారం జరిగింది. జెండా ఆవిష్కరణ, వందే మాతరం గీతాలాపన, ప్రజా సమస్యలపై రాజకీయ తీర్మానాన్ని సమావేశంలో ప్రవేశపెట్టారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అర్సనపల్లి సూర్యారావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు, యువ మోర్చా రాష్ట్ర నాయకులు నాయినేని పవన్‌కుమార్‌, మేడ్చల్‌ జిల్లా కో కన్వీనర్‌ పద్మయ్య, కూకట్‌పల్లి అసెంబ్లీ కన్వీనర్‌ శ్రీకర్‌రావు, ఓబీసీ లీగల్‌ సెల్‌ రాష్ట్ర కన్వీనర్‌ శ్రీనివాస్‌ గౌడ్‌ పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



ఓటు హక్కు వినియోగించుకున్న విద్యార్థులు

మూసాపేట: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని పంచశీల పాఠశాల కరస్పాంటెండెంట్‌ శ్రీనివాస్‌ అన్నారు. శనివారం పాఠశాలలో విద్యార్థి నాయకుల ఎంపిక కోసం ఎన్నికలు నిర్వహించి అవగాహన కల్పించారు. 8 మంది పోటీలో నిలిచారు. సాధారణ ఎన్నికలు ఏ విధంగా జరుగుతాయో అలాగే ప్రచారానికి సమయం కేటాయించి, గుర్తులు కేటాయించి ఎన్నికలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు: బండి రమేష్‌



సీసీ రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న బండి రమేష్‌, కాంగ్రెస్‌ నాయకులు

కూకట్‌పల్లి: అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు ఉంటాయని కాంగ్రెస్‌ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్‌ అన్నారు. ఫతేనగర్‌ డివిజన్‌ ఇందిరాగాంధీ పురం దగ్గరలో రూ.60 లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను శనివారం పరిశీలించారు. ఈఈ శ్రీనివాస్‌, డీఈ ఆనంద్‌, ఏఈ పవన్‌లతో ఫోన్‌లో మాట్లాడి పనుల నాణ్యతపై ప్రశ్నించారు. సీసీ రోడ్డు నిర్మాణంపై క్వాలిటీ కంట్రోల్‌ సర్టిఫికెట్‌ తమకు అందజేయాలని కోరారు. అనంతరం బస్తీలోని మంచినీటి సమస్య గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మయ్య, నాగిరెడ్డి, రమేష్‌, బాకీ, వరహాల స్వామి, పెంటయ్య, జ్యోతి పాల్గొన్నారు.

బొమ్మగాని జగన్నాథంగౌడ్‌ మృతి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



బొమ్మగాని జగన్నాథంగౌడ్‌

మోతీనగర్‌: మూసాపేట డివిజన్‌ మోతీనగర్‌ ఎంఆర్‌డబ్ల్యూ అడహక్‌ కమిటీ కన్వీనర్‌ బొమ్మగాని జగన్నాథంగౌడ్‌ (85) శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మూసాపేట డివిజన్‌ కార్పొరేటర్‌ కొడిచర్ల మహేందర్‌, కాంగ్రెస్‌ పార్టీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్‌, మాజీ కార్పొరేటర్‌ శ్రావణ్‌కుమార్‌ తదితరులు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగన్నాథంగౌడ్‌ కబీర్‌నగర్‌ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా, మోతీనగర్‌ అడహక్‌ కమిటీ కన్వీనర్‌గా విధులు నిర్వహించారు. మోతీనగర్‌లో ప్రజలకు మంచి చేసే ఏ పనిలోనైనా ఆయన ముందుండేవారని నాయకులు గుర్తు చేశారు. పీఆర్‌నగర్‌ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

భూ పరిరక్షణకు ప్రత్యేక వ్యూహం!

- ప్రభుత్వ, అసైన్డ్‌ భూములపై ఆరా
- పైలెట్‌ ప్రాజెక్టు కింద భూసర్వేకు సన్నద్ధం
- అన్యాక్రాంతమైన ప్రభుత్వ, అసైన్డ్‌ భూముల గుర్తింపునకు రెవెన్యూ శాఖ చర్యలు
- క్షేత్ర స్థాయిలో వీఆర్‌ఓ, వీఏఓలు లేకపోవటంతో తప్పని ఇబ్బందులు



సాక్షి, సిటీబ్యూరో: నగర శివారు మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ, అసైన్డ్‌ భూముల పరిరక్షణకు అధికార యంత్రాంగం ప్రత్యేక వ్యూహంతో ముందుకు సాగుతోంది. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ, అసైన్డ్‌ భూములకు రక్షణ కవచంగా నిలిచి వాటి ఆక్రమణలపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు చేరవేసే వీఆర్‌ఓ, వీఏఓల వ్యవస్థలను గత ప్రభుత్వం తప్పించిన విషయం విదితమే. ఆ వ్యవస్థలను సంబంధిత శాఖ నుంచి తప్పించి ఇతర శాఖల్లో సర్దుబాటు చేయటంతో భూ పరిరక్షణ రెవెన్యూ శాఖకు ఓ సవాల్‌గా మారిందనే చెప్పొచ్చు. ఈ నేపథ్యంలోనే భూముల పరిరక్షణకు పైలెట్‌ ప్రాజెక్టు కింద సర్వే నిర్వహించి, సాంకేతికంగా కిహోల్‌ మార్కప్‌ లాంగ్వేజ్‌ (కేఎంఎల్‌) మ్యాప్‌ (గూగుల్‌)లో పొందుపరిచేందుకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.

మండలాల వారీగా భూముల గుర్తింపు ..

మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలోని 15 మండలాల పరిధిలో గతంలో గుర్తించిన ప్రభుత్వ, అసైన్డ్‌ భూముల వివరాలను మరోసారి పరిశీలించి, వాటి పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై వ్యూహాత్మకంగా వ్యవహరించాలని రెవెన్యూ యంత్రాంగం భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే భూ పరిరక్షణకు జిల్లా, రెవెన్యూ డివిజన్‌ స్థాయిల్లో సర్వే నిర్వహించేందుకు తగిన కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నారు. అలాగే ప్రభుత్వ, అసైన్డ్‌ భూముల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, విధివిధానాలపై కూడా కసరత్తు చేస్తోంది. ప్రభుత్వ, అసైన్డ్‌ భూములను సంరక్షించే బాధ్యత ఆర్‌ఐ, డీటీ, తహసీల్దార్లపైనే ఉందని పేర్కొంటున్న జిల్లా యంత్రాంగం గుర్తించిన ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రహరీలు, ఫెన్సింగ్‌ వంటి రక్షణ చర్యల అవశ్యకతపై కూడా దృష్టి సారిస్తోంది.

కోర్టుల్లో వివాద కేసులు ఇలా...

మేడ్చల్‌ జిల్లాలో భూసంబంధిత కోర్టు కేసులు 706 ఉండగా ఇందులో మల్కాజిగిరి రెవెన్యూ డివిజన్‌ పరిధిలో 349, కీసర డివిజన్‌లో 357 ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే వివిధ కోర్టుల్లో ఉన్న కేసుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. సుప్రీం కోర్టులో ఒకటి కాగా, హైకోర్టులో 481, జిల్లా కోర్టులో 65, లోకాయుక్త కోర్టులో 57, ఎల్‌డీ కోర్టులో 63, సివిల్‌ కోర్టులో ఆరు కేసులు కొనసాగుతున్నాయి. అలాగే కోర్టు ధిక్కారంలో 35 ఉన్నట్లు రెవెన్యూ శాఖ రికార్డుల బట్టి తెలుస్తోంది.

కబ్జాదారుల కబంధ హస్తాల్లో...

జిల్లాలోని 11 మండలాల పరిధిలో దాదాపు 269 సర్వే నంబర్లలో 5,195 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు రెవెన్యూ శాఖ గుర్తించింది. ఇందులో ఎన్ని భూములు కబ్జాకు గురయ్యాయి. ఎంత సంరక్షణలో ఉందనే సమాచారాన్ని మాత్రం చెప్పలేకపోతోంది.

- రెవెన్యూ రికార్డుల ప్రకారం బాలానగర్‌ మండలంలో 700 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు తెలుస్తోంది.
- శామీర్‌పేట మండలంలో 420 ఎకరాలు, దుండిగల్‌ గండిమైసమ్మ మండలంలో 425 ఎకరాలు, మేడిపలి మండలంలో 900 ఎకరాలు, ఘట్‌కేసర్‌ మండలంలో 500 ఎకరాలు, కాప్రా మండలంలో 400 ఎకరాలు, కీసర మండలంలో 417 ఎకరాలు, కుత్బుల్లాపూర్‌ మండలంలో 600 ఎకరాలు ఉన్నట్లు తెలుస్తోంది.
- బాచుపల్లి మండలంలో 360 ఎకరాలు, ఉప్పల్‌ మండలంలో 333.13 ఎకరాలు, మల్కాజిగిరి మండలంలో 113.06 ఎకరాలు, మేడ్చల్‌ మండలంలో 37 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు రెవెన్యూ శాఖ రికార్డులు చెబుతున్నాయి.

అసైన్డ్‌ భూములెక్కువనే...

జిల్లాలో 2004వ సంవత్సరానికి ముందు 116 రెవెన్యూ గ్రామాలు, పలు ప్రాంతాలు, బస్తీల పరిధిలో 8,230 మంది పేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీ లబ్ధిదారులకు 11,384 ఎకరాల ప్రభుత్వ భూములను అసైన్డ్‌ చేశారు.

- ఈ అసైన్డ్‌ భూములన్నీ వ్యవసాయ పంట సాగు, ఇళ్ల స్థలాల కోసం పంపిణీ చేశారు. ఘట్‌కేసర్‌ మండలంలోని 17 గ్రామాల్లో 1610 ఎకరాలు, శామీర్‌పేట మండలంలోని 30 గ్రామాల్లో 1451 ఎకరాలు, కీసర మండలంలోని 16 గ్రామాల్లో 1500 ఎకరాలు ఉంది.
- మేడ్చల్‌ మండలంలోని 29 గ్రామాల్లో 4400 ఎకరాలు, ఉప్పల్‌ మండలంలోని 6 రెవెన్యూ గ్రామాల్లో 286 ఎకరాలు, కుత్బుల్లాపూర్‌ మండలంలోని 18 గ్రామాల్లో 855 ఎకరాల అసైన్డ్‌ భూములను అప్పటి ప్రభుత్వం నిర్ణయంలో భాగంగా రెవెన్యూ యంత్రాంగం పంపిణీ చేసింది. ఇందులో చాలా మేరకు వెంచర్లు, రియల్‌ ఎస్టేట్‌ వెంచర్లు, అపార్టు మెంట్లు, ఇండిపెండెంట్‌ ఇళ్లు, ప్రైవేట్‌ విద్యా సంస్థలు, ఆస్పత్రులుగా మారినట్లు తెలుస్తోంది.

వివాదంలో చిక్కిన భూములివే...

మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో భూవివాదాలు అధికంగా ఉన్నాయి. రెవెన్యూ శాఖ రికార్డుల ప్రకారం వివాదాస్పద భూములు 12,073.17 ఎకరాలు ఉన్నాయి. ఇందులో సివిల్‌ కోర్టు పరిధిలో వివాదంలో ఉన్న భూములు 2,485 ఎకరాలు కాగా, రెవెన్యూ కోర్టు పరిధిలో 904 ఎకరాలు ఉన్నట్లు రెవెన్యూ శాఖ గుర్తించింది.

- ఇతర వివాదాలతోపాటు ఎండోమెంట్‌, వక్ఫ్‌, ఫారెస్టు, వ్యక్తిగత వివాదాల పరిధిలో 2,466 ఎకరాలు ఉన్నట్లు రెవెన్యూ శాఖ పేర్కొంటున్నది. అసైన్డ్‌ భూముల కేటాయింపుల్లో భాగంగా 1603 ఎకరాల భూములు కూడా వివాదాల్లో ఉన్నాయి.
- జిల్లాలో 5,837 ఎకరాలకు సంబంధించిన వివాదాస్పద భూముల వివరాల లెక్క తేలగా, మిగతా 6,236 ఎకరాలకు సంబంధించిన వివాదాస్పద భూముల వివరాలను రెవెన్యూ శాఖ గోప్యంగా ఉంచినట్లు తెలుస్తోంది.
- జిల్లాలో లెక్క తేలిన 5,837 ఎకరాల భూ వివాదాలకు సంబంధించి మండలాల వారీగా ఇలా ఉన్నాయి. శామీర్‌పేట్‌ ఉమ్మడి మండలంలో 2,189 ఎకరాల భూములు వివాదంలో ఉండగా, ఇందులో ఫారెస్టుకు సంబంధించి 629 ఎకరాలు, ఎండోమెంట్‌కు సంబంధించి 1560 ఎకరాలు ఉన్నట్లు తెలుస్తోంది.
- మేడ్చల్‌ మండలంలో 1500 ఎకరాలు, ఘట్‌కేసర్‌
- మండలంలో 1000 ఎకరాలు, కీసర మండంలో 500 ఎకరాలు, మేడిపల్లి మండలంలో 460 ఎకరాలు, కాప్రా మండలంలో 69 ఎకరాలు, దుండిగల్‌ మండలంలో 70, ఉప్పల్‌ మండలంలో 50 ఎకరాల భూములు వివాదంలో ఉన్నట్లు తెలుస్తోంది.

నేడు బీజేపీ కార్యవర్గ సమావేశం

మోతీనగర్‌: బీజేపీ అల్లాపూర్‌ డివిజన్‌ కార్యవర్గ సమావేశం ఆదివారం పర్వత్‌నగర్‌ మినీ ఫంక్షన్‌ హాలులో నిర్వహించనున్నారు. సమావేశానికి కూకట్‌పల్లి ఇన్‌చార్జి మాధవరం కాంతరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, మేడ్చల్‌ జిల్లా అర్బన్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ పద్మయ్య ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు.

ఘనంగా ఆలయ నవ వార్షికోత్సవం



చండీహోమంలో పాల్గొన్న భక్తులు, అర్చకులు

ఓల్డ్‌ బోయిన్‌పల్లి: అంజయ్యనగర్‌ రిటైల్‌ కూరగాయల మార్కెట్‌లోని కనకదుర్గమ్మ ఆలయ 9వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. మార్కెట్‌ చైర్మన్‌ మక్కాల సత్యనారాయణ ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు చేసి చండీహోమం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో మక్కాల నర్సింగ్‌రావు, దండుగుల రమేష్‌, నిమ్మకాయల నర్సింగ్‌ తదితరులు పాల్గొన్నారు.

దీక్షకు తరలి వెళ్లిన బీసీ నాయకులు

ఓల్డ్‌ బోయిన్‌పల్లి: సమగ్ర కుల గణన, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ కల్పించాలని బీసీ నాయకులు రాజుగౌడ్‌ డిమాండ్‌ చేశారు. శనివారం ఇందిరాపార్కు వద్ద బీసీ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాజారామ్‌ యాదవ్‌ ఏర్పాటు చేసిన సత్యాగ్రహ దీక్షకు ఓల్డ్‌ బోయిన్‌పల్లి డివిజన్‌ నుంచి బీసీ నాయకులు తరలివెళ్లి మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో మట్టి శ్రీను, పోచయ్య, శ్రీహరియాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ.. ఉద్యోగ అవకాశాలు

ఆల్విన్‌కాలనీ: టెక్‌ మహీంద్రా ఫౌండేషన్‌, నియో కర్సర్‌ ఆధ్వర్యంలో పలు కోర్సుల్లో నిరుద్యోగ యువతకు 3 నెలల ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తామని సంస్థ నిర్వాహకులు శనివారం తెలిపారు. కూకట్‌పల్లి ప్రశాంతి నగర్‌లోని సోని కాంప్లెక్స్‌లోని సంస్థ చిరునామాలో శిక్షణ ఉంటుందన్నారు. బ్యాంకింగ్‌ ఫైనాన్స్‌ సర్వీస్‌, ఇన్‌ఫ్రా ఎంఎస్‌ ఆఫీస్‌, టైపింగ్‌, స్పోకెన్‌ ఇంగ్లిష్‌, ఇంటర్వ్యూ స్కిల్‌ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తామన్నారు. ఇంటర్‌, డిగ్రీ పూర్తై 18 నుంచి 28 సంవత్సరాల లోపు ఉన్న వారు అర్హులన్నారు. 16వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి కలిగిన వారు వివరాల కోసం 7799594242, 9959976231 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

- ప్రజల సౌకర్యార్థం మరిన్ని పార్కులు, క్రీడా ప్రాంగణాలు
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- అభివృద్ధి పనుల పరిశీలన



నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: వివిధ అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులకు ఆదేశించారు. మలేషియన్‌ టౌన్‌షిప్‌ వెనుకాల 5 ఎకరాల పార్కును, 4వ ఫేజ్‌ ఎస్‌టీపీ ప్లాంట్‌ వద్ద ఫ్లై ఓవర్‌ క్రింద క్రీడా ప్రాంగణానికి సంబంధించిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 9వ ఫేజ్‌లోని 3 ఎకరాల స్థలంలో జీహెచ్‌ఎంసీ లేదా హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో ఆదర్శవంతమైన పార్క్‌ను నిర్మించాలని సూచించారు. ఈ విషయమై ఇప్పటికే ముఖ్యమంత్రి, జిల్లా మంత్రికి వినతిపత్రం అందజేశానని గుర్తు చేశారు. వన్‌ సిటీ పక్కనే ఉన్న హౌసింగ్‌ బోర్డు ఖాళీ స్థలాన్ని మహిళా పార్కు మాదిరిగా అభివృద్ధి చేయడంతో పాటు రోడ్డుపై నీళ్లు నిలవకుండా ఉండేలా వాటర్‌ మార్వెస్టింగ్‌ పిట్స్‌ నిర్మించాలన్నారు. ఇండోర్‌ క్రీడా ప్రాంగణానికి సంబంధించిన పనులను పూర్తి చేయాలన్నారు. చిరు వ్యాపారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పనులు చేపట్టాలని సూచించారు. ప్రజల సౌకర్యార్థం మరిన్ని పార్కులు, క్రీడా ప్రాంగణాలు అందుబాటులో తీసుకొచ్చేందుకు సత్వర చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో కేపీహెచ్‌బీ కార్పొరేటర్‌ మందడి శ్రీనివాసరావు, డివిజన్‌ అధ్యక్షులు కృష్ణారెడ్డి, ఈఈ శ్రీనివాస్‌, డీఈ ఆనంద్‌, ఏఈ సాయి ప్రసాద్‌, యూబీడీ సమత, వాటర్‌వర్క్స్‌ మేనేజర్‌ శ్రీకాంత్‌రెడ్డి, వెంకటేష్‌ నాయకులు కృష్ణారెడ్డి, రాజేష్‌, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని 45 మందికి సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులు మంజూరయ్యాయి. రూ.18.42 లక్షల విలువ గల చెక్కులను శనివారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ పథకం నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో చిట్టిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, మాయ బాల నరసింహ, సంపత్‌రెడ్డి, శ్రీకాంత్‌, మోహన్‌రెడ్డి, సురేష్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఎమ్మెల్యే వివేకానంద్‌



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్‌

కుత్బుల్లాపూర్‌: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్‌ అన్నారు. శనివారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్‌ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు వివిధ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వివేకానంద్‌ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్‌ మగ్దుంనగర్‌లోని శ్రీ సాయి విద్యానికేతన్‌ హైస్కూల్‌లో మల్లారెడ్డి నారాయణ హాస్పిటల్‌, లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ సికింద్రాబాద్‌ నార్త్‌ సంస్థల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆ శిబిరాన్ని ఎమ్మెల్యే వివేకానంద్‌ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ జగన్‌, డివిజన్‌ అధ్యక్షుడు రుద్ర అశోక్‌, లయన్స్‌ క్లబ్‌ జిల్లా గవర్నర్‌ లయన్‌ రాజేంద్రప్రసాద్‌, లయన్‌ ఎస్‌.ఎన్‌ రెడ్డి, వినోద్‌ జాదవ్‌, రామ్‌కుమార్‌ దేవత, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు రామేశ్వర్‌ రెడ్డి, పాఠశాల కరస్పాంటెండెంట్‌ బిర్రు ఆంజనేయులు, ప్రిన్సిపాల్‌ శోభారాణి, వైద్యులు పాల్గొన్నారు.

13న జరిగే ర్యాలీని జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కూచిపూడి సత్యం

కూకట్‌పల్లి: మహాజన నేత మందకృష్ణ మాదిగ ఈ నెల 13న ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న సందర్భంగా నిర్వహించే ర్యాలీని జయప్రదం చేయాలని ఎంఆర్‌పీఎస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి కూచిపూడి సత్యం అన్నారు. శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డివిజన్‌ నుంచి మాదిగ ఉప కులాల ప్రజలు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొనాలన్నారు. సమావేశంలో సూదిపాక వాసుదేవరావు మాదిగ, చిరంజీవి, పుత్రరాజు, అభిలాష్‌, చింటూ, చంద్రకళ, సాయమ్మ, మానయ్య, గణేష్‌, అనిల్‌ తదితరులు పాల్గొన్నారు.

సువర్ణ భారతి మహోత్సవ పూజలు



వేద పాఠశాలకు రూ.లక్ష అందజేస్తున్న భక్తులు

మోతీనగర్‌: మూసాపేట డివిజన్‌ మోతీనగర్‌ శంకర్‌మఠం ఆవరణలో సువర్ణ భారతి మహోత్సవం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ వరసార పరాశర సాంగ వేద పాఠశాల విద్యార్థులచే వేద పారాయణం నిర్వహించారు. వేద పాఠశాలకు భక్తులు, శంకరమఠం ప్రతినిధులు లక్ష రూపాయలను మోతీనగర్‌ శ్రీ శృంగేరి శారద శంకరమఠం ధర్మాధికారి సీఎస్‌ఆర్‌ మూర్తి అందజేశారు.